క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు విద్యార్థులను పరీక్షించారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన



వివరాలు సేకరిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు గురువారం సందర్శించారు. విద్యార్థినిల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థినిలు చక్కగా చదవాలని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మెనూ ఆరా తీశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

నిరుపయోగంగా ఆసుపత్రి అంబులెన్స్



సీహెచ్‌సీలో వృథాగా ఉన్న అంబులెన్స్

బాడంగి: స్థానిక సీహెచ్‌సీకి చెందిన ఆసుపత్రి అంబులెన్స్ మూలకు చేరింది. దీంతో మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసే రోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఖాళీ ఉంటే 108లో వ్యయప్రయాసల కోర్చి రోగులను తరలిస్తున్నారు. ఆసుపత్రిలో అంబులెన్స్ ఉన్నా నిరుపయోగంగా పడి ఉండడాన్ని రోగులు తప్పు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీన్ని వినియోగంలోకి తీసుకువచ్చి రోగులకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



ద్రవరూప ఎరువుల వినియోగాన్ని వివరిస్తున్న ఏడీఏ

బొబ్బిలిరూరల్: నానో యూరియా, డీఏపీ వంటి ద్రవ నత్రజని, భాస్వరంతో పంటకు ఎంతో మేలు జరుగుతుందని అగ్రికల్చర్ ఏడీఏ మజ్జి శ్యాంసుందర్ సూచించారు. మండలంలోని పారాది గ్రామంలో ఎరువుల వినియోగంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మొదటిసారి పంటలకు ఎరువుల వినియోగంలో ఎకరా పొలానికి అరలీటరు నానో డీఏపీ, యూరియాను పిచికారి చేయడం ద్వారా పంటకు సోకే తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. అధిక పంట దిగుబడికి ద్రవరూప ఎరువుల వినియోగాన్నే పాటించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో వీవో ఏలు రాజశేఖర్, ఉష, రైతులు పాల్గొన్నారు.

శాకాంబరీదేవిగా గాయత్రిమాత



శాకాంబరీదేవి అలంకారంలో గాయత్రిమాత

రాజాం సిటీ: పట్టణ పరిధి గాయత్రి కాలనీలో వెలసిన గాయత్రిమాత ఈ నెల 18 నుంచి మూడు రోజులపాటు శాకాంబరీదేవిగా దర్శనమివ్వనుందని ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానందరావు తెలిపారు. గురువారం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించామని అన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది మాదిరిగానే అమ్మవారిని అలంకరించామని, ఈ కూరగాయలతో మూడు రోజుల అనంతరం అన్న సమారాధన చేయనున్నామని వెల్లడించారు.

21 నుంచి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో

- మున్సిపల్ వార్డులకు ఇంచార్జ్‌లు, కమిటీల నియామకం
- మాజీ ఎమ్మెల్యే శంబంగి



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న శంబంగి

బొబ్బిలి: ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన చంద్రబాబు మేనిఫెస్టో అమలు చేయడంలో విఫలమయ్యారని ఈ క్రమంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో ఈ నెల 21 నుంచి ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చెప్పారు. వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించి గురువారం శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో పార్టీ ఇంచార్జ్‌లను నియమించారు. నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో చైతన్యం తేవాలని, మోసపూరిత చంద్రబాబు హామీలు, మేనిఫెస్టోపై ప్రజలకు వివరించాలన్నదే రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇంచార్జ్‌లంతా ఆయా వార్డుల్లో పర్యటించి ప్రభుత్వ మోసాలని ప్రజల్లోకి తీసుకెళ్లేలా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చెబుతున్నది ఒక్కటని, ఆచరిస్తున్నది మోసం చేయడమే అజెండాగా మారిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేక, ప్రజలకు సమాధానం చెప్పలేక రోజుకో అబద్ధపు ప్రచారాలను తెరపైకి తెస్తున్నారని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా ఇంకా అన్నదాత సుఖీభవ అందలేదని గుర్తు చేశారు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలను నయవంచన చేసిన ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం రూపొందామని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలను ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, కౌన్సిలర్లు, నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ నిర్మాణానికి రహదారి నిర్మాణం



పైడితల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు జేసీబీతో రోడ్డు పనులు చేపట్టిన దృశ్యం

తెర్లాం: దశాబ్దాల కాలంగా ఆ గ్రామంలోని గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు పడిన ఇబ్బందులు ఎట్టకేలకు తీరిపోయాయి. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ జిరాయితీ భూములను రోడ్డు నిర్మాణానికి ఇవ్వడంతో వెంటనే గ్రామ సర్పంచ్ జేసీబీతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రంగప్పవలస గ్రామంలో గల పైడితల్లి అమ్మవారి ఆలయానికి గ్రామస్తులు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ఆలయానికి వెళ్లే మార్గంలో గ్రామానికి చెందిన కొంతమంది రైతుల జిరాయితీ భూములు ఉండడంతో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం ఇవ్వాలని గ్రామానికి చెందిన సీతారాం, త్రినాధలను కోరడంతో వారు సానుకూలంగా స్పందించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో సర్పంచ్ శనపతి రాంబాబు జేసీబీ సహాయంతో గురువారం రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్య తీరినందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వితరణగా ఇచ్చిన రైతులను గ్రామస్తులు, సర్పంచ్ రాంబాబు అభినందించారు.

కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయండి : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్: మండలంలో కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో జెవివి.రామ్మోహనరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేయాలని, ఆధార్‌తో బ్యాంకు అకౌంట్లు లింకేజీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా ఇంకా కౌలు రైతులను గుర్తించి కార్డులివ్వకపోవడం విచారకరమని, గుర్తింపు ప్రక్రియ వేగవంతానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని రకాలైన పత్రాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీను, అగ్రికల్చర్ ఏడీఏ శ్యాంసుందర్, ఆర్ఐ రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టీచర్ హ్యాండ్ బుక్స్ పంపిణీ

తెర్లాం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 1 నుంచి 10 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు టీచర్స్ హ్యాండ్ బుక్స్‌ను గురువారం ఎంఈవో త్రినాధరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తెర్లాం హైస్కూల్‌లో ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ టీచర్స్ హ్యాండ్ బుక్ ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులకు వార్షిక ప్రణాళికలు, పీరియడ్ వారీగా విద్యార్థులకు ఏ విధంగా బోధించాలి, పాఠ్యాంశాల వారీగా పాఠ్య బోధనా ప్రణాళికలు టీచర్స్ హ్యాండ్ బుక్‌లో ఉంటాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ ఈ పుస్తకాలు పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని ఎంఈవో తెలిపారు. ఆయనతో పాటు ఎంఈవో-2 పాపారావు, హైస్కూల్ హెచ్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయినిలకు సన్మానం

రాజాం: పట్టణ పరిధిలోని సారధి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయినిలను గురువారం ఘనంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాలలో విధులు నిర్వహించిన ఆంగ్ల ఉపాధ్యాయిని బొద్దాం హేమలత, సైన్సు ఉపాధ్యాయిని ఎం.సూర్యకాంత, తెలుగు ఉపాధ్యాయిని జి.విమల, పీఈటీ ఎం.లక్ష్మిలను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం బి.మాధురి, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: నియోజకవర్గంలోని రైతాంగం సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటుందని, ఖరీఫ్‌లో ఎటువంటి సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను వైఎస్సార్‌సీపీ రాజాం ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్నమొన్నటి వరకు మడ్డువలస కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టకపోవడంతో ఆయకట్టులో వరి నారుమళ్లు ఎండిపోయాయని, తోటపల్లి కాలువ ద్వారా సబ్ చానల్స్‌కు చుక్క నీరు కూడా రావడం లేదని తెలిపారు. ఇప్పుడు నారాయణపురం కుడి కాలువ ఆయకట్టులో ఇదే పరిస్థితి కనిపిస్తుందని ఆరోపించారు. నారాయణపురం ఆనకట్టకు సంబంధించి నిధులు డ్రా చేసి, పనులు చేయలేదని, కొత్త తలుపులు ఆనకట్టకు బిగించలేదని విమర్శించారు. కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టకుండా, రైతులకు అందుబాటులో ఉండకుండా ఆ కాలువ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నదిలోకి మొత్తం నీరు వెళ్లిపోతుందని, కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టి రైతులకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం రైతులంతా ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఇంత చేతగాని ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని ధ్వజమెత్తారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పార్టీ జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, మనోజ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



పెదపల్లిలో మినీ గోకులం షెడ్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బాడంగి: ఉపాధి పథకం పనులను కేంద్ర బృందం గురువారం తనిఖీ చేసింది. మండలంలోని పెదపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీలకు చెందిన పనులను, రికార్డులను బృందం సభ్యులు పరిశీలించారు. వీటిలో పాం పాండ్లు, మినీ గోకులాలు, ట్రెంచ్ పనులు, ఇళ్లు, సీసీ రోడ్లు, కాలువలు పరిశీలించారు. వీటికి సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి వినియోగం, ఉపయోగం, నాణ్యతపై ఆరా తీశారు. కేంద్రం సమకూర్చుతున్న నిధులను సక్రమంగా వినియోగించుకొని తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందాలని అన్నారు. బృందంలో నాతూసింగ్, సుశీల్‌బంటా ఉన్నారు. వీరి వెంట డ్వామా డీబీఐ మేనేజర్ ఆశీష్, డ్వామా డీపీఎం మూర్తి, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత, డిప్యూటీ ఎంఈ డీవో దేవకుమార్, సర్పంచ్ పోలమ్మ, పార్వతి, ఏపీవో సాయిరాం, ఏపీఎం రత్నాకర్, పీఆర్ జేఈ రమేష్, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

భూమి ఖాతా నంబరుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

తెర్లాం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు వారి భూముల ఖాతా నంబర్లకు ఆధార్ నంబర్లు అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. ఏయే గ్రామానికి చెందిన రైతుల భూముల ఖాతాలకు ఆధార్ నంబర్లు అనుసంధానం కాలేదో ఆ గ్రామ వీఆర్‌వోలను గురువారం గ్రామానికి పంపించి అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 249 ఖాతా నంబర్లకు ఇంతవరకు ఆధార్ అనుసంధానం, అప్‌డేషన్ కాలేదన్నారు. వీరంతా స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయంలోగానీ, మీసేవా కేంద్రాల్లోగాని ఆధార్ అప్‌డేషన్, అనుసంధానంకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీఆర్‌వోలను గ్రామాల వారీగా రైతుల వద్దకు పంపించి వారు దరఖాస్తు చేసుకొనేలా అవగాహన కల్పిస్తున్నామని, ఆధార్ అప్‌డేషన్, అనుసంధానం భూముల ఖాతా నంబర్లకు కాకపోతే అన్నదాత సుఖీభవ డబ్బులు రావని ఆయన స్పష్టం చేశారు. ఆధార్ అప్‌డేషన్ కోసం పలు గ్రామాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన తనిఖీ చేశారు.

ఢిల్లీ యూనివర్సిటీకి వంగర యువకుడు



బెవర రవితేజ

వంగర: మండల కేంద్రం వంగర గ్రామానికి చెందిన బెవర రవితేజ ఢిల్లీ విశ్వవిద్యాలయం(ఢిల్లీ యూనివర్సిటీ)లో స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో పీహెచ్‌డీ చేసేందుకు ఎంపికయ్యాడు. చిన్న తనం నుంచే పట్టుదలతో చదివిన రవితేజ ప్రాథమిక విద్యను వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ ఓ ప్రైవేటు కళాశాల, బీటెక్‌ను ప్రైవేటు కళాశాలలో పూర్తి చేశాడు. సామాజిక సేవ పట్ల ఉన్న అభిరుచితో తమిళనాడులోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్మెంట్(ఆర్‌జీఎన్ఐవైడీ)లో మాస్టర్స్ పూర్తి చేశారు. మహారాష్ట్రలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ అనే అంతర్జాతీయ సంస్థలో మేనేజ్మెంట్ విభాగంలో పనిచేసి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలు మరియు వారి కుటుంబాల సంక్షేమానికి సహకరించారు. తాజాగా ఢిల్లీ యూనివర్సిటీలో సోషల్ వర్క్ విభాగంలో 'సామాజిక ఆవిష్కరణ మరియు సాంకేతికత అనుసంధానం ద్వారా సామాజిక అభివృద్ధి లక్ష్యాలు సాధించడం' అనే అంశంపై పీహెచ్‌డీలో పరిశోధనలు చేస్తారని తెలిపారు. కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు, పలువురు నాయకులు రవితేజను అభినందించారు.

గ్రామాల సందర్శన



అంతకాపల్లిలో సంపద తయారీ కేంద్రం పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం: మండలంలోని అంతకాపల్లి, పొగిరి, వీఆర్‌అగ్రహారం తదితర గ్రామాల్లో గురువారం ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాలు తనిఖీ చేయడంతో పాటు సర్వీసులపై ఆరా తీశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పరిశీలించి, వాటి నిర్వహణ వివరాలు క్లాప్ మిత్రలు నుంచి సేకరించారు. గ్రామాల్లో మహిళలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సచివాలయ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రేగిడి: స్వయంశక్తి సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు ఆర్థికంగా మెరుగుపడాలని ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళిక 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వీవో ఏలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సంఘంలో ఉన్న ప్రతి మహిళ చక్కగా వినియోగించుకునే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ సంఘం అధ్యక్షురాలపై ఉందన్నారు. ప్రతి మహిళ స్వశక్తిగా అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు



ఖరీఫ్‌లో రైతులకు కూటమి సర్కారు తీరుతో యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారు. రామభద్రపురం మండలంలో యూరియా కోసం సహకార సంఘాలు, ఆర్‌ఎస్‌కేల వద్ద పెద్ద సంఖ్యలో రైతులు క్యూ కడుతున్నారు. బుధవారం రొంపల్లి, కొట్టక్కి ఆర్‌ఎస్‌కేల వద్ద రైతుల మధ్య తోపులాట జరిగింది. చిన్నపాటి వివాదాలు కూడా చోటు చేసుకున్నాయి. గంటల తరబడి పడిగాపులు కాశారు. అయినా ఒకొక్కరికి ఒక్క యూరియా బస్తా మాత్రమే దక్కడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు.

– రామభద్రపురం

సంక్షిప్తంగా..

భూసమస్యలు పరిష్కరించండి

వంగర: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై తక్షణమే స్పందించాలని తహసీల్దార్ హరి రమణారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన గ్రామ సర్వేయర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని, భూ సమస్యల్లోస్తే తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రుంకాన శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: డివిజన్ పరిధిలోని 132కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ అనంతరావు తెలిపారు. దీంతో గ్రోత్ సెంటర్ సబ్ డివిజన్ పరిధిలోని నారశింహునిపేట, ముక్కువ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొదుపు సంఘాలు భాగస్వామ్యం కావాలి

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో విద్య, వైద్యం ,మౌలిక సదుపాయాలు, రక్షణ వంటి అంశాల్లో పొదుపు సంఘాల సభ్యులు భాగస్వామ్యులు కావాలని వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి సూచించారు. వెలుగు కార్యాలయంలో గురువారం వీవో, వీఓఏలకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధికి పొదుపు సభ్యులు భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. శిక్షణలో స్త్రీనిధి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రింగ్ ట్రెంచ్‌లతో ఉపయోగం

వంగర: మొక్కలు చుట్టూ ఏర్పాటు చేస్తున్న రింగ్ ట్రెంచ్‌లతో ఎంతో ఉపయోగపడతాయని ఎంపీడీవో ఎస్.రఘునాధాచారి తెలిపారు. గురువారం వంగరలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల్లో మొక్కలు చుట్టూ వేతనదారులు ఏర్పాటు చేస్తున్న రింగ్ ట్రెంచ్‌లు పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్ జక్కు తిరుపతి ఉన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు

వంగర: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. గురువారం వంగరలో వాహన తనిఖీలు చేశారు. రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనాలు

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో త్రినాధరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయకపోయినా, మెనూ ప్రకారం భోజనాలు విద్యార్థులకు పెట్టకపోయినా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. హెచ్‌ఎం రమేష్ ఉన్నారు.

పిల్లలకు మంచి భోజనం

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారంగా పిల్లలకు భోజనం పెట్టాలని బూరాడ సెక్టార్ సూపర్వైజర్ నూకాలమ్మ కార్యకర్తలకు సూచించారు. గురువారం మండలంలోని అంబకండి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.

సీజనల్ వ్యాధులపై తస్మాత్..



విద్యార్థినిలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వాతి

తెర్లాం: సీజనల్ వ్యాధుల పట్ల కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినిలంతా అప్రమత్తంగా ఉండాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రెడ్డి స్వాతి అన్నారు. మండలంలోని కుమ్మరిపేట గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినిలకు ఆరోగ్య తనిఖీలను గురువారం నిర్వహించారు. సీహెచ్‌వో భాస్కరరావు, ఏఎన్‌ఎంలు ప్రశాంతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాలిబాటలతో పంటలకు ప్రయోజనం

రేగిడి: ఖరీఫ్‌లో నాట్లు వేసిన ప్రతీ రైతు పొలంలో తప్పనిసరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అవగాహన కలిగించారు. గురువారం మండలంలో వావిలవలస, లింగాలవలస గ్రామాల్లో వరినాట్లు పరిశీలించారు. కాలిబాటలు ఏర్పాటుచేయడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు.

వరి నారు చిగుళ్లను తొలగించాలి

రేగిడి: ఖరీఫ్‌లో రైతులు వరి నారు తీసిన వెంటనే చిగుళ్లను తొలగించి నాట్లు వేసుకోవాలని గురువారం ట్రైనీ మాస్టర్ రమాదేవి వివరించారు. మండలంలోని ఉంగరాడ గ్రామంలో నారు మడుల్లో కొనలు తుంచి బీజామృతంతో నారును శుద్ధి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల

సంతకవిటి: మండల పరిధి రంగారాయపురం వద్ద నారాయణపురం ఆనకట్ట నుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం సాగునీటిని విడుదల చేశారు. ముందుగా కుడి ప్రధాన కాలువ వద్ద హెడ్ స్లూయిస్‌ల వద్ద పూజలు చేసి కాలువలోకి నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎస్.ఢిల్లీశ్వరరావు, శ్రీకాకుళం కార్యనిర్వహక ఇంజినీర్ పి.సుధాకర్, సహాయక ఇంజినీర్లు రాంబాబు, రామశివాజి పాల్గొన్నారు.

ఎరువుల కోసం అన్నదాత పాట్లు

బాడంగి: మండలంలోని రైతులు ఎరువుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్ వరి సాగుకు సమయం ఆసన్నమైనందున వాటిని కొనుగోలు చేసి నిల్వ చేసుకునేందుకు రైతులు ఆరాట పడుతున్నారు. ఎరువుల దుకాణాలు, ఆర్‌ఎస్‌కేల వద్దకు పరుగులు పెడుతున్నారు. మండలంలో మొత్తం 17 ఆర్‌ఎస్‌కేలకు కేవలం ఏడింటికే యూరియా, డీఏపీ ఎరువులు రాగా మిగిలిన వాటికి ఇంకా రాలేదని అధికారిక సమాచారం. దీంతో రైతులు ఎరువుల కోసం అవస్థలు పడుతున్నారు.

దేశ పటిష్టతకు న్యాయ వ్యవస్థే కీలకం

బొబ్బిలి: దేశ పటిష్టతకు, రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడేందుకు న్యాయవ్యవస్థ కీలకమని, న్యాయవ్యవస్థలో బలహీనవర్గాలకు బాసటగా నిలిచి వారికి న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు అన్నారు. గురువారం అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మోహన మురళీకుమార్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా జేసీ రాజు మాట్లాడుతూ బలహీనుల తరఫున వాదించి వారికి న్యాయం చేసేందుకు కృషి చేసిన వారిని సత్కరించడం వారిని ప్రోత్సహించడం అవుతోందన్నారు. శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామభద్రపురం: బొబ్బిలి 33 కేవీవీవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బొబ్బిలి, సాలూరు ఫీడర్ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఐలో భాగంగా విద్యుత్ తీగలు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపుతో పాటు లైన్లు నిర్వహణ పనులు జరుగుతాయన్నారు. అలాగే 11 కేవీ నాయుడువలస ఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనులు చేసే క్రమంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనుందని తెలిపారు. దీంతో ఆరికతోట, బూసాయవలస, మామిడివలస, పాడివానివలస, ఎస్ చింతలవలస, మర్రివలస, పాలవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.